

అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్–21 జూనియర్స్ బాలబాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸

దొంగల హల్‌చల్

నస్పూర్: పట్టణంలోని ఓ వైన్‌షాప్, రెండు ప్రైవేటు పాఠశాలల్లో దొంగలు హల్‌చల్ చేశారు. స్థానిక ఎస్సై సుగుణాకర్, బాధితులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి రాయల్ గార్డెన్ సమీపంలోని ప్రైవేటు పాఠశాలలో బీరువాలు పగులగొట్టి రూ.15 వేలు నగదు అపహరించారు. మరో పాఠశాలలో దొంగతనానికి ప్రయత్నించినా ఏమీ దొరకలేదు. తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఓ వైన్‌షాప్‌లో సుమారు రూ.20 వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ అపహరించుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇంటింటా ఓటరు సర్వే నిర్వహించాలి



బీఎల్‌వోతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి: ఇంటింటా ఓటరు సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అశోక్‌నగర్, బెల్లంపల్లిబస్తీ, బజారు ఏరియా ప్రాంతంలో సర్వే తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటా సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని, సర్వేను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. డెప్యూటీ తహసీల్దార్ కల్పన, ఎన్నికల విభాగం(డీటీ) హమీద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న అదనపు కలెక్టర్ దంపతులు



అదనపు కలెక్టర్‌కు ప్రసాదాలు అందజేత

ధర్మపురి: ధర్మపురిలోని లక్ష్మీనృసింహస్వామిని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పక్షాన వారికి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు, దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్లను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ రవీందర్ మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. మున్సిపల్ సిబ్బంది నిమజ్జన ఘాట్‌ను శుభ్రం చేశారు. గాంధీ చౌక్ నుంచి పెద్ద చెరువు కట్ట వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. పెద్ద చెరువు ఘాట్ వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయంలో ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఏసీపీ సూచించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమం జరిగే విధంగా నిర్వాహకులు సహకరించాలని అన్నారు. మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాల విద్యార్థులు 12మంది అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ తెలిపారు. ఈ నెల 13న కళాశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పీఈటీ రాజేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్సీ కసరత్తు !



- నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ షురూ
- పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీకి ఎన్నికలు
- పోటీలో నిలిచేందుకు ఆశావహుల సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న శాసనమండలిలోని స్థానాలకు తిరిగి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే మార్చి 29న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పదవీ కాలం పూర్తి కానుంది. ఇదే జిల్లాల పరిధిలోని టీచర్స్ శాసనమండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలం కూడా పూర్తవనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులతోపాటు అర్హులైన ప్రభుత్వ టీచర్లను కొత్త ఓటర్లుగా నమోదు, ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. అంతా పూర్తి చేసి వచ్చే డిసెంబర్ వరకు తుది జాబితా సిద్ధం చేయనుంది. దీంతో నూతనంగా నమోదైన ఓటర్లతో వచ్చే ఆరునెలల్లోపు ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు కొత్తగా పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. వచ్చే నవంబర్ 11నాటికి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులకు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించింది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

ఆశావహులు రెడీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేస్తున్నారు. ఆ మేరకు ఆయా జిల్లాల పరిధిలో బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పోటీలో ఉండే ఆశావహులు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యావంతులు, ఉపాధ్యాయ వర్గాలకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ చేరువ అవుతున్నారు. రాష్ట్రంలో 42అసెంబ్లీ స్థానాలు, ఆరు లోక్‌సభ స్థానాల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉండడంతో ఓటర్లను కలవడం, ప్రచారం చేయడం అభ్యర్థులకు కష్టతరం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ మేరకు బరిలో ఉండే రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు, స్వతంత్రులు సైతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన పలువురు నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. విద్యార్థులు, టీచర్ల సంఘాలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంచిర్యాల పరిధిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు పార్టీ నాయకత్వం ఆదేశిస్తే పోటీలో ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం నిర్మల్ జిల్లాకు చెందిన కృష్ణారావు బరిలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. వీరితోపాటు పలువురు విద్యావంతులు, రాజకీయ నాయకులు, ప్రైవేటు టీచర్ల అసోసియేషన్ నుంచి పట్టభద్రుల స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గ పరిధి విస్తృతంగా ఉండడంతో ఆయా జిల్లాల పరిధిలో పోటీలో ఉన్న వారు తమ పార్టీ నాయకుల మద్దతుతోపాటు స్థానికులు, ఇతర జిల్లాల్లోనూ మద్దతు కూడగట్టాల్సి ఉంది. దీంతో ఏయే జిల్లాల నుంచి ఎవరు తుది వరకు ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉంటారనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

ఓటరు నమోదు వివరాలు

ఈ నెల 30న పబ్లిక్ నోటీసు
అక్టోబర్ 16న మొదటిసారి పబ్లికేషన్
అక్టోబర్ 25 రెండోసారి పబ్లికేషన్
నవంబర్ 6వరకు ఓటరు నమోదుకు గడువు
నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా
నవంబర్ 23నుంచి డిసెంబర్ 9వరకు అభ్యంతరాల స్వీకరణ
డిసెంబర్ 25వరకు అభ్యంతరాల పరిష్కారం
డిసెంబర్ 12న ఓటరు జాబితా ప్రచురణ
డిసెంబర్ 30న తుది జాబితా

గ్యాస్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట: ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ సబ్సిడీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రూ.500కే సిలిండర్ అందిస్తోందని, అభయహస్తంను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, జాబితాలో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం బీఎల్‌ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, ముసాయిదా జాబితా ఆధారంగా ఉన్నతాధికారులు సూచించిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. తహసీల్దార్ భోజన్న, పంచాయతీ కార్యదర్శి కవిత, అధికారులు పాల్గొన్నారు.

సీఓఈ గురుకులం సందర్శన



ఇంచార్జి ప్రిన్సిపాల్‌తో సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ)ను నేషనల్ హ్యూమన్ రైట్స్, జస్టిస్ మూమెంట్ సభ్యులు శనివారం సందర్శించారు. గురుకుల ఇంచార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీధర్‌తో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్, జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు రేగుంట ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ మనీషా, జనరల్ సెక్రెటరీ బత్తిని కృష్ణ, లీగల్ అడ్వైజర్ శ్రీకాంత్, భారతి పాల్గొన్నారు.



జన్నాపూర్‌లో గణేషుడికి 108 రకాల ప్రసాదం సమర్పించిన భక్తులు

108నైవేద్యాలు

భీమిని: కన్నెపల్లి మండలం జన్నాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణేషుడికి శనివారం 108 రకాల నైవేద్యాలు(ప్రసాదాలు) మహిళా భక్తులు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నైవేద్యాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువుల భూములు కాపాడాలని ధర్నా


లక్సెట్టిపేట: మండలంలోని చెరువులు, కుంటల్లో కబ్జాకు గురైన భూములను కాపాడాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ దిలీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది వ్యక్తులు చెరువులో భూములు కబ్జా చేసి భవనాలు నిర్మించారని, కుంటల్లో భూములను కబ్జా చేశారని తెలిపారు. ఎఫ్‌టీఎల్ భూములను కబ్జా చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం, నాయకులు ఆకాష్, అరుణ్, రవీందర్, యోగేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నిండుకుండలా ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా దర్శనమిస్తోంది. శనివారం ప్రాజెక్ట్ నీటిమట్టం వివరాలిలా ఉన్నాయి. పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను 20.175 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 11,100 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 6,250 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 297 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, ప్రాజెక్ట్‌లోని 6 గేట్లు ఎత్తి 17 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.



ఎల్లంపల్లి జలాశయం

వసతిగృహాలు దూరం

- అద్దె భవనాల్లో అరకొర వసతులు
- కాలేజీకి వెళ్లి రావాలంటే కాలినడకనే..



రైల్వేప్లాట్ ఫాం దిగి వెళ్తున్న విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: వసతిగృహాలు ఓ చోట.. కాలేజీలు మరోచోట కావడంతో విద్యార్థులు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. అద్దె భవనాల్లోని ప్రభుత్వ వసతిగృహాల్లో అరకొర వసతుల మధ్య అవస్థలు పడాల్సి వస్తోంది. చెన్నూర్, దండేపల్లి బాలుర, మందమర్రి బీసీ బాలికల, బీసీ కాలేజీ హాస్టల్ (బాలుర), బీసీ కాలేజీ హాస్టల్(బాలుర) మంచిర్యాల, చెన్నూర్ బీసీ కళాశాల వసతిగృహం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మంచిర్యాలలోని బాలుర, బాలికల వసతిగృహాలు విద్యార్థులకు దూరభారంగా మారాయి. బీసీ బాలికల వసతిగృహం రైల్వేస్టేషన్ వెనుకాల ఓ అద్దె భవనంలో కొనసాగుతోంది. 142మంది విద్యార్థినులు వసతి పొందుతూ ప్రభుత్వ కళాశాలలకు వెళ్లి చదువుతున్నారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థినులకు బస్సు సౌకర్యం ఉంది. వసతిగృహం నుంచి ప్రభుత్వ కళాశాలలకు వెళ్లాలంటే దాదాపు మూడు కిలోమీటర్ల పైనే దూరం ఉంటుంది. రైల్వేప్లాట్‌ఫారం ఎక్కి దిగిన తర్వాత రైల్వేస్టేషన్ మెయిన్ రోడ్, శ్రీనివాస టాకీస్‌రోడ్, ఓవర్ బ్రిడ్జి మీదుగా గోదావరి రోడ్‌లో ఉన్న ప్రభుత్వ కళాశాలకు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. రైలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో విద్యార్థినులు వసతిగృహానికి వచ్చే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

బాలుర పరిస్థితి మరోలా..

శ్రీశ్రీనగర్(తోళ్లవాగు) సమీపంలో ఓ ఇరుకు అద్దె భవనంలో బాలుర కళాశాల వసతిగృహం కొనసాగుతోంది. అక్కడున్న గదుల్లో వందమంది ఉండడం కూడా కష్టమే.. కానీ 156కు పైగా మంది ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కళాశాలలకు వెళ్లాలంటే మెయిన్ రోడ్డు వరకు అర కిలోమీటరుపైనే నడిచి రావాల్సి ఉంటుంది. అక్కడి నుంచి బస్సుకు వచ్చి ఓవర్ బ్రిడ్జి దిగి దాదాపు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారు. మరికొందరు రైలు పట్టాల పక్కన నుంచి వెళ్తున్నారు.

కళాశాలకు వెళ్లి రావాలంటే..

కళాశాలకు వెళ్లాలంటే కాలకృత్యాలు, స్నానాలకు ఉదయం 5గంటల్లోపే నిద్ర లేవాల్సి ఉంటుంది. సరిపడా స్నానగదులు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉదయం 7గంటల తర్వాత అల్పాహారం తిని సద్ది పట్టుకుని వెళ్లాలి. మెనూ ప్రకారం మధ్యాహ్నం వేడి భోజనం పెట్టాలని అధికారులు చెబుతున్నా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. కళాశాలలు దూరంగా ఉన్నాయంటూ ఉదయమే మధ్యాహ్న భోజనం పెట్టేస్తున్నారు.

ఇలా చేస్తే..

వసతిగృహాలకు పక్కా గృహాలు నిర్మించే వరకు కళాశాలకు అందుబాటులో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పాత కలెక్టరేట్ భవనంలో ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ గదులున్నాయి. ఇక్కడ బీసీ కళాశాలల వసతిగృహం ఏర్పాటు చేస్తే బాగుంటుందని విద్యార్థులు సూచిస్తున్నారు. బీసీ సమీకృత బాలుర వసతి గృహం మాదిరిగానే ఎస్సీ బాలికల వసతిగృహంలో తాత్కాలికంగా బీసీ బాలికల వసతిగృహం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు రక్షణతోపాటు చదువులు దగ్గర అవుతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

'అమర వీరుల ఆశయాలను కొనసాగిస్తాం'



మాట్లాడుతున్న వెంకటస్వామి

బెల్లంపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. శనివారం బెల్లంపల్లి నెంబర్–2 ఇంక్‌లైన్ బస్తీలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి ఎర్రజెండా ఎగుర వేసి అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం నిర్వహించిందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాజి శంకర్‌రావు, రామకృష్ణశాస్త్రి, బాశెట్టి గంగారాం, పోతుగంటి పోశెట్టి, రంగనాథరావు మరెందరో ముందుండి సాయుధ పోరాటాన్ని సాగించారని తెలిపారు. అమరుల వారసత్వాన్ని పునికి పుచ్చుకుని కమ్యూనిస్టులు ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట యోధుల వీరగాథల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రాజేష్, సీపీఐ శ్రేణులు పుల్లూరి ఉదయ్, ప్రభుదాస్, దుర్గయ్య, చైతన్యకుమార్, చంద్రయ్య, రాయమల్లు, రాజయ్య, స్వామిదాస్, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులు పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా డీఎన్ఏ టెస్టు(జన్యుపరమైన వ్యాధి నిర్ధారణ పరీక్ష) చేయించుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో శనివారం డీఎన్ఏ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 35 మంది వ్యాధిగ్రస్తులకు డీఎన్ఏ పరీక్షలు చేశామని, దీంతోపాటు వ్యాధిగ్రస్తులు, కుటుంబ సభ్యులు హెచ్‌బీఏ2 రక్త పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. వ్యాధిగ్రస్తులకు జన్యుపరమైన డీఎన్ఏ పరీక్ష చేయిస్తే ఆరోగ్యశ్రీ పథకంతోపాటు రాబోవు కాలంలో సదరం సర్టిఫికెట్లు కూడా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తలసేమియా ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్ ఇంచార్జి కాసర్ల శ్రీనివాస్, రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ వి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కే.సత్యపాల్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'హౌసింగ్ సొసైటీపై ఆరోపణలు నిరాధారం'



మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీహరి

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీపై పలువురు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అందరూ కలిసికట్టుగా సమస్యలు పరిష్కరించుకోవాలని సొసైటీ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నస్పూరులోని కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో దాదాపుగా 45 ప్లాట్లు రోడ్డు కింద పోయాయని, అందులో 30 మందికి సర్దుబాటు చేశామని, మిగతా 15 మందికి కూడా సర్దుబాటు చేస్తామని అన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 110 ప్లాట్లలో ప్రొసీడింగ్స్ ఉన్న వారికి అందరి సమక్షంలోనే లక్కీడ్రా తీసి ప్లాట్లు కేటాయించామని, అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ప్లాట్ నంబర్ 231, హౌసింగ్ సొసైటీకి చెందిన 5.20 ఎకరాల భూమి కోర్టు కేసులో ఉన్నందున కోర్టు కేసు పూర్తయిన వెంటనే, మిగిలిన వారికి కేటాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు మొండయ్య, దేవ రాజేశ్వర్, కార్యదర్శి హబీబ్ హుస్సేన్, కోశాధికారి సంతోశ్‌కుమార్, ఉపాధ్యక్షులు మొండయ్య, సయ్యద్, ఇంతియాజ్ అహ్మద్, సభ్యులు మహమ్మద్, మురళీ దర్, లక్ష్మణ్, ప్రకాశ్‌రావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఈ నెల 15నుంచి ప్రారంభం కానున్న సికింద్రాబాద్–నాగ్‌పూర్ వందేభారత్ రైలుకు మంచిర్యాల స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల పట్టణాన్ని ఆనుకుని పరిశ్రమలు ఉన్నాయని, హాల్టింగ్ ఇస్తే హైదరాబాద్, నాగ్‌పూర్, మహారాష్ట్ర వెళ్లడానికి పారిశ్రామిక ప్రాంతాల అధికారులు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. బీజేపీ నాయకులు రైల్వేమంత్రిని కలిసి మంచిర్యాలలో హాల్టింగ్ కోసం వినతిపత్రాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, దేవి పోచన్న, కుంచాల శంకరయ్య, కోడి వెంకటేశం, రాయమల్లు, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ యువకుడి మృతి


సందీప్ (ఫైల్)

భీమారం: మండలంలోని పోలంపల్లికి చెందిన యువకుడు నర్మెట్ట సందీప్ చికిత్సపొందుతూ హన్మకొండ ఆసుపత్రిలో మృతిచెందాడు. హెడ్ కానిస్టేబల్ మాచర్ల కథనం ప్రకారం.. పోలంపల్లి గ్రామానికి చెందిన సందీప్ (22) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. తల్లి ఆరోగ్యం బాగాలేక పోవడంతో గతనెల 22న రాఖీ పండుగ రోజు ఇంటికి వచ్చాడు. తల్లి అనారోగ్యం బారిన పడడం చూసి బాధపడ్డాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు పంపించి చికిత్స అందించారు. కోలుకున్నాక తిరిగి అతన్ని ఇంటికి తీసుకువచ్చారు. తిరిగి సందీప్ ఆరోగ్యం క్షీణించడంతో హన్మకొండ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి సురేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శాకపురం శంకరయ్యపై శనివారం కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. శనివారం మత్స్యకారుల ఎన్నికలు ఉండడంతో గ్రామానికి చెందిన పందిరి లింగయ్య, గుమ్ముల సంతోష్ పోటీగా ఉన్నారని వారిద్దరిని ఈ నెల 13న శంకరయ్య మాయమాటలు చెప్పి కారులో గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లాడని పేర్కొన్నారు. రాత్రి వరకు ఇద్దరు ఇంటికి రాకపోవడంతో అనుమానంతో లింగయ్య భార్య సరోజన శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కార్మికుడికి పాముకాటు

జైపూర్: ఇందారం ఐకే1ఏ గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు రాము పాము కాటుకు గురయ్యాడు. శనివారం విధులకు వచ్చిన రాము గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన షెల్టర్‌లో రివర్‌గార్డుగా పని చేస్తుండగా పాము కాటేసింది. చికిత్స నిమిత్తం అతన్ని ఏరియా ఆస్పత్రికి అటునుంచి కరీంనగర్‌కు తరలించినట్లు సమాచారం.

భార్యాభర్తల రిమాండ్

చింతలమానెపల్లి: రవీంద్రనగర్–2 పంచాయతీలో ఈనెల 11న జరిగిన దాడి ఘటనలో భార్యాభర్తలను శనివారం రిమాండ్ తరలించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బుధవారం రాత్రి సమయంలో అన్నదమ్ములు కృష్ణ మండల్, పవిత్రమండల్ మధ్య వివాదం చోటు చేసుకుంది. అన్న కృష్ణమండల్‌పై తమ్ముడు, అతని భార్య ఉమ మండల్ కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి భార్య హీరామండల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి
- 22 జిల్లాల నుంచి 980 మంది క్రీడాకారులు హాజరు


పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్–21 జూనియర్స్ బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే పోటీలను మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తాచాటి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుంద్రు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి గంగాధర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న పోటీల్లో 22 జిల్లాల నుంచి మొత్తం 980 మంది క్రీడాకారులు, 22 మంది కోచ్‌లు, 22 మంది సబ్ కోచ్‌లు పాల్గొన్నారు. మొదటి రోజు నిర్వహించిన పోటీల్లో హైదరాబాద్ బాలుర జట్టు, పెద్దపల్లి జట్టు తలపడ్డాయి. ఇందులో హైదరాబాద్ 7–0తో విజయం సాధించింది. బాలికల జట్టులో రంగారెడ్డి, సిద్దిపేట జట్లు తలపడ్డాయి. ఇందులో రంగారెడ్డి 08–01తో గెలుపొందింది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లోని బికనూరులో ఈనెల 30 నుంచి జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ జమున, పీటీ భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలు అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. గత మూడేళ్ల నుంచి బేస్‌బాల్‌లో మెలకువలు నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి, ఒకటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చి ముందుకెళ్లాలని కోరిక.

– స్పందన, నిర్మల్ జట్టు

జాతీయ స్థాయికి ఎంపికవుతా..



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికవుతా. ఇప్పటివరకు 4 జాతీయస్థాయి, 7 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రపంచ స్థాయిలో పాల్గొనాలనేదే నా లక్ష్యం.

– బిందు, కామారెడ్డి జట్టు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ముందుకెళ్తున్నా. గత మూడేళ్ల నుంచి బేస్‌బాల్ నేర్చుకున్నా. ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపిక కావడమే లక్ష్యం. – పరమేశ్వర్ మహబూబాబాద్ జట్టు

జిల్లాకు పేరు వస్తుంది



రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు అన్ని రకాల వసతులు కల్పించాం. 22 జిల్లాల నుంచి 22 జట్లు ఇక్కడికి వచ్చాయి. ఈ పోటీలు నిర్వహించడంతో జిల్లాకు ఎంతో పేరు వస్తుంది. – సుధాకర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు

కూలిన కాజ్‌వే..


అక్కెపల్లి వాగుపై ఒక పక్క కూలిన కాజ్‌వే

మండలంలోని అక్కెపల్లి గ్రామానికి వెళ్లేదారిలో వాగుపై ఉన్న కాజ్‌వే కూలింది. ఇప్పటికే ఒక పక్కకు కూలిపోగా, కొంచెం ముందుకు వెళ్లగానే మధ్యలో పెద్దగుంత ఏర్పడింది. శనివారం అక్కెపల్లి నుంచి చెన్నూర్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న టాటాఏస్ వాహనం గుంతలో దిగబడింది. ప్రయాణికులు, గ్రామస్తులు సుమారు గంట పాటు శ్రమించి వాహనాన్ని బయటకు తీశారు. వాగు ప్రవాహ సమయంలో ఇలా జరిగితే ప్రమాదాలు సంభవిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వాగుపై వంతెన నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– చెన్నూర్‌రూరల్

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


గెలుపొందిన విద్యార్థులు

చెన్నూర్: లక్సెట్టిపేటలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–18లో 1000 మీటర్ల పరుగుపందెంలో టి.ప్రశాంత్ (ప్రథమ), లాంగ్‌జంప్‌లో ఆర్.శ్రావణ్‌కుమార్ (ప్రథమ), హైజంప్‌లో (ద్వితీయ), డిస్క్‌త్రో, జావెలిన్ త్రోలో అజయ్ (ద్వితీయ), 600 మీటర్ల పరుగుపందెంలో టి.రిషిత్ (ప్రథమ) స్థానాల్లో గెలుపొందారని ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా కళాశాల మైదానంలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో వారు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ విజయ్‌కుమార్, ఏటీపీ, డిప్యూటీ వార్డెన్‌లు శ్రీకాంత్, సునీల్ పాల్గొన్నారు.

పాముకాటుతో సెక్యూరిటీ గార్డు మృతి!


నవీన్ మృతదేహం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ సెక్యూరిటీ గార్డుగా సిడాం నవీన్ పాము కాటుతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..తిర్యాణి మండలం నాయకపుగూడకు చెందిన నవీన్ (24), మహారాష్ట్రకు చెందిన వైభవ్ రావత్‌లు కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహించి శుక్రవారం రాత్రి కంపెనీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వెనుకాల వారికి కేటాయించిన బ్యారక్ (షెడ్)లో నిద్రించారు. శనివారం తెల్లవారుజామున నవీన్, వైభవ్ రావత్‌కు కడుపునొప్పి, వాంతులు అయ్యాయి. పక్కన ఉన్న సెక్యూరిటీ సిబ్బంది గమనించి మంచిర్యాల మెడిలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వైభవ్‌ను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించిన విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాలు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం, పోలీసులు సాయంత్రం వరకు చర్చలు జరిపి మృతుడి కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థికసాయం, కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం, తల్లిదండ్రులకు నెలకు రూ.6 వేల చొప్పున పెన్షన్ మాదిరి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలపడంతో వివాదం సద్దుమణిగింది. కాగా మృతుడు, బాధితుడు కడుపునొప్పి, వాంతులు రావడం ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చునని, పాముకాటు వేసిందా అనే అనుమానాలను తోటి ఉద్యోగులు లేవనెత్తుతున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వివరాలు తెలుస్తాయని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేస్తాం

- రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- హైదరాబాద్‌లో అత్యవసర సమావేశం
- పాల్గొన్న గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గల్ఫ్ సంఘాల నాయకులు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ప్రవాసీ విధానం (ఎన్‌ఆర్‌ఐ పాలసీ) అమలు చేస్తామని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులతో రాష్ట్రస్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి నిర్మల్ జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సంఘాల నాయకులతో చర్చించినట్లు స్వదేశ్ వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిస్థితులు, ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాటపడుతున్న తీరును గురించి ప్రధానంగా చర్చించినట్లు పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం నాలుగు అంశాలపై చర్యలు చేపట్టనున్నట్లు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిపారు. గతేడాది డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షలు చెల్లింపు, గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమంపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటు, హైదరాబాద్ ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి' ఏర్పాటు, గురుకుల విద్యాసంస్థల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు అడ్మిషన్లలో ప్రాధాన్యత కల్పించడం.. తదితర నిర్ణయాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, సారంగాపూర్ తాజా మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, గల్ఫ్ సంఘాల నాయకులు వినోద్‌కుమార్, మంద భీమ్‌రెడ్డి నరేశ్‌రెడ్డి, శ్రీనివాసరావు, రాజేందర్‌రావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

18న కార్మిక సమస్యలపై ధర్నా

బెల్లంపల్లి: కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసంఘటిత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిర్వహించే ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు మల్లయ్య, శ్రేణులు రమేష్, చరణ్, చంద్రయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి రావాలని ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌తోపాటు వివిధ గ్రామాల్లో సోమవారం గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించేందుకు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమానికి రావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎస్పీ నాగేందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రాంప్రసాద్, ప్రత్యేక అధికారి ప్రభాకర్‌లకు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కొండేరి రమేశ్, శికారి శ్రీనివాస్, దేవిదాస్, తిరుపతి, అరికిల్ల అశోక్, గోపాల్‌సింగ్, వెంకటేశ్, బొంత ఆశారెడ్డి, లింగాగౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు


తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్రశాఖ పిలుపు మేరకు చలో జైనూర్ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లాలోని బీజేపీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, తిర్యాణి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జైనూర్ ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న తమను శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు నాయకులు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, విశాల్ ఖాంద్రే, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, అసెంబ్లీ కన్వీనర్ రమేశ్ గౌడ్, తిర్యాణి మండల అధ్యక్షుడు వెంకటేశ్, రెబ్బెన మండల ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, ఆనంద్, ఆత్రం గోపాల్, నాయకులు శ్రీనివాస్, సుభాష్, జయరాజ్ ఉన్నారు.

డాక్టర్ పట్టా అందుకున్న గిరిజన మహిళ


పట్టా అందుకుంటున్న లలిత

బెజ్జూర్: మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ సడిమెక లలిత ఓయూలో పీజీ, ఎంఏ తెలుగు పూర్తిచేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించే అధ్యాపక పరీక్ష కోసం యూజీసీ నెట్ జేఆర్ఎఫ్ సెట్‌కు అర్హత సాధించింది. ఈమె హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ప్రాచ్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. ఉస్మానియా ఓరియంటల్ తెలుగు విభాగంలో డాక్టర్ అజ్మీర సిల్మానాయక్ పర్యవేక్షణలో 'పరిణీతవాని ప్రసంగాలు–సాహిత్య, సాంస్కృతిక అధ్యయనం' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసింది. ఇందుకుగాను శనివారం ఆమెకు డాక్టరేట్ పట్టా అందుకుంది. పట్టా అందుకున్న ఆమెను తల్లిదండ్రులు పార్వతి–శంకర్, మండల ప్రజలు అభినందించారు.

చదువుపై ఆసక్తి..మూడు కొలువులు కొట్టి


ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో సెలూన్ షాప్ నిర్వాహకుడు గంగాధర్ కుమారుడు ఉదయ్‌కుమార్ చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో మూడు కొలువులు కొట్టాడు. గ్రూప్–4 పరీక్షలు రాసి ఏఈఈలో 159 ర్యాంక్, పాలిటెక్నిక్ లెక్చరర్‌లో 166వ ర్యాంక్, ఏఈలో 366వ ర్యాంకు సాధించి మూడు కొలువు సాధించాడు. ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చునని, తను చదివించిన తల్లిదండ్రులకు రుణపడి ఉంటానని ఉదయ్‌కుమార్ తెలిపాడు. ఉదయ్‌కుమార్‌కు శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను సన్మానించారు. నాయకులు గర్షకుర్తి వెంకటేశ్, పుండలిక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి.. మూడు కొలువులు సాధించి


తల్లిదండ్రులతో సాయికృష్ణ

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని చించర్‌వాడ కాలనీకి చెందిన ముత్యాల సాయికృష్ణ 2018లో గ్రూప్–4 పరీక్షలో సత్తాచాటి ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2022లో మళ్లీ గ్రూప్–4 పరీక్ష రాసి ర్యాంకు సాధించాడు. గత ఆగస్టులో కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టుదలతో చదివి మూడు ప్రభుత్వ కొలువులు సాధించాడు. ఈయన తల్లిదండ్రులు పొచ్చన్న–రూప. ప్రస్తుతం ఇంటెలిజెన్స్‌లో అసిస్టెంట్ ఎనలైటిక్ అధికారిగా ఉద్యోగంలో చేరుతానని సాయికృష్ణ తెలిపారు.